క్లుప్తంగా

మహిళల విష్ణు సహస్ర నామ పారాయణ



పారాయణ చేస్తున్న మహిళలు

దాబాగార్డెన్స్ : అల్లిపురం వేంకటేశ్వరమెట్టపై వేంచేసిన సాయి దుర్గా గణపతి ఆలయంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ మహిళలచే సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్రం, లలితా సహస్ర నామ స్తోత్రం, గోవింద నామ సంకీర్తన నిర్వహించారు. నగరానికి చెందిన ఆధ్యాత్మిక సేవా సంస్థ స్వపంతి మాతృమండలి నిర్వాహకురాలు ఆర్‌వీ సూర్యకుమారి సారథ్యంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పారాయణ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పద్మ, సుజాత, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

కుట్టు మిషన్ల పంపిణీకి చర్యలు

దాబాగార్డెన్స్ : విశాఖ పోర్ట్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నైపుణ్య భారతి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల యువతీ యువకులకు కుట్టు మిషన్లు అందజేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు హర్ష రవితేజ ఒక ప్రకటనలో తెలిపారు. నిరుపేద కుటుంబాల్లో కుటుంబ యజమానిపై మొత్తం భారం పడకుండా ఉండేందుకు తన వంతు బాధ్యతగా కుటుంబ యజమానికి తోడ్పాటుగా ఉండాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్లు అందజేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఫొటోలు, టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్‌తో ద్వారకానగర్‌లో గల సంస్థను సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 8977160333 నంబరులో సంప్రదించాలన్నారు.

రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

దాబాగార్డెన్స్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి రెల్లి సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. విశాఖ ఒకటో నియోజకవర్గంగా ఉన్న ప్రస్తుత విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 2 లక్షల 20 వేల ఓటర్లు ఉన్నారని, వీరిలో దళిత సామాజిక వర్గానికి సుమారు 45 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలో అత్యధికంగా ఉన్న రెల్లి కుల సామాజిక వర్గాన్ని గుర్తించి ఈ దఫా టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని వెంకట్రావు కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మద్రిపాలెం: మద్రిపాలెం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తునట్టు ఐసీడీఎస్ సీడీపీవో రమణి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఆయా పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆమె చెప్పారు. స్థానిక స్థిర నివాసం కలిగిన వివాహిత, 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు నోటిఫికేషన్ దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ధ్రువపత్రాల నకళ్లను గెజిట్ అధికారిచే అటెస్టేషన్ చేయించి వాటిని నేరుగా గానీ, పోస్టు ద్వారా గానీ ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మద్రిపాలెం ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని రమణి కుమారి కోరారు.

చేతివృత్తిదారులకు తోడు..
జగనన్న చేదోడు



ఒకప్పుడు రెక్కాడితే కానీ డొక్కాడని బడుగులను ఎవరూ పట్టించుకునే వారు కాదు. ఓట్ల పండగ సమయంలో మాత్రం మీకు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ కొందరు నేతలు వారికి అరచేతిలో స్వర్గం చూపించేవారు. తర్వాత కనిపించేవారు కాదు. పాపం బడుగులు మళ్లీ బరువుగా తమ బతుకులు ఈడ్చేవారు. అయితే జగనన్న సర్కార్ వచ్చాక మాత్రం వారికి మేలు జరుగుతోంది. ముఖ్యంగా చేతివృత్తిదారులకు చేదోడు పథకం ద్వారా రూ. 10 వేలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారు సీఎం జగన్. తమను గుర్తించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు తాము సదా రుణపడి ఉంటామని చేతివృత్తిదారులంటున్నారు.





నియోజకవర్గంలో చేతివృత్తిదారులకు గత నాలుగేళ్లుగా జగనన్న అందించిన చేదోడు

2019-20లో 97 మంది లబ్ధిదారులకు రూ. 9.70 లక్షలు	2021-22లో 169 మంది లబ్ధిదారులకు రూ. 16.90 లక్షలు
2020-21లో 97 మంది లబ్ధిదారులకు రూ. 9.70 లక్షలు	2022-23లో 174 మంది లబ్ధిదారులకు రూ. 17.40 లక్షలు

జగదాంబ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు అందిస్తు ఆ కుటుంబాలకు పెద్ద కొడుకుగా నిలుస్తున్నారు. ఈ ఏడాది కూడా జగనన్న చేదోడు పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఖతాలకు నగదు జమ అయింది. అర్హులై ఉండి పథకం అందని వారు సచివాలయల్లో సెక్రటరీల ద్వారా దరఖాస్తు చేసుకోవడంతో వారికి కూడా జగనన్న రూ. పదివేలు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. నియోజకవర్గంలో మొత్తం నాలుగేళ్లకు రూ. 53.7 లక్షలు అర్హులకు అందజేశారు. గత ప్రభుత్వాలు ఓట్ల కోసమే తమను ఉపయోగించుకున్నాయి తప్ప ఎలాంటి మేలు చేయలేదని చేతివృత్తిదారులంటున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం అన్ని కులాల వారికి, చేతి వృత్తిదారులకు ప్రత్యేక గుర్తింపునిచ్చారంటున్నారు. చేదోడుతో వచ్చిన డబ్బులు ఇంటి అవసరాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చేదోడు చక్కగా ఉపయోగపడింది..



మాట తప్పని నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్ని వర్గాలను కలుపుకుని వెళ్తున్నారు. చేతివృత్తిదారులందరికీ అందిస్తున్న చేదోడుతో మేం చాలా సంతోషంగా ఉన్నాం. ఆయనిచ్చిన నగదుతో మాకు కాలసిన పరికరాలు కొనుక్కుని.. కొంత ఇంటి అవసరాలకు కూడా వాడుకున్నాం. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– శివ, బార్బర్ షాపు యజమాని, పందుపుల్లల సందు, 35వ వార్డు

పనిముట్లు కొనుక్కున్నాం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రజకులను గుర్తించారు. చాలీచాలని సంపాదనతో బతుకుతున్న మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం వచ్చాక చేదోడు పథకం ద్వారా మమ్మల్ని ఆదుకుంటున్నారు. ఈ పథకం వల్ల ఎందరో బడుగు బలహీన వర్గాల వారికి మేలు జరుగుతోంది. కావలసిన పరికరాలు కొనుక్కునేందుకు జగన్‌బాబు ఇచ్చిన నగదు ఉపయోగపడుతోంది.

– రాజులు, లాండ్రీ దుకాణం యజమాని, 35వ వార్డు

పలువురికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థికసాయం



రోగులకు ఆర్థిక సాయం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి కుమారుడు సూర్య

మహారాణిపేట : మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం 36,31,38,39 వార్డులకు సంబంధించిన బాధితులకు ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. ఆయన కుమారుడు వాసుపల్లి సూర్య బాధితులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. రంగిరీజువీధికి చెందిన కిలాడీ కొండమ్మకు, గొడారి గోతులుకు చెందిన మిరజా మెహిది బేగంకు, సున్నపువీధికి చెందిన చల్ల లక్ష్మికి, సున్నపు వీధికి చెందిన మొహమ్మద్ ఫాతిమున్నిసా బేగంకు, రంగిరీజువీధికి చెందిన సారంపూడి దేముడుకు, చెంగలరావుపేటకు చెందిన మిరజా కానిజ్ జహీర్‌హరలకు, 31వ వార్డు సింగ్ హోటల్ జంక్షన్‌కు చెందిన అంగ సూర్య ప్రకాశరావుకు, 38వ వార్డు బుక్కా వీధికి చెందిన గోవింద మోహన్‌కు, 39వ వార్డుకు చెందిన గణగళ్ల నిత్యకు ఆర్థిక సాయం చేశారు. అలాగే జలగడుగుల ఆదిలక్ష్మి, కదిరి మహాలక్ష్మికి రూ. 3,500 చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఆలయ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీ ప్రతినిధికి సత్కారం



ఎర్రాజీని సత్కరిస్తున్న యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆనందరావు తదితరులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు బొట్టా ఎర్రాజీ వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కమిటీలో యూనియన్ కార్యదర్శిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు నేతృత్వంలో ఘనంగా సత్కరించారు. 25 ఏళ్లుగా ఉద్యోగ, కార్మికులకు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పల్లా ఆనంద్, బంగారుకుమార్, పి. కనకరాజు, బాబి, నాయుడు, ఆర్. సత్యం, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

'మహిళల హక్కులు కాలరాస్తున్న బీజేపీ'



ఆశీలమెట్ట వద్ద నినాదాలు చేస్తున్న పీవోడబ్ల్యూ ప్రతినిధులు

సీతమ్మధార : మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులను బీజేపీ, ఆర్ఎస్ఎస్ కాలరాస్తున్నాయని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పీవోడబ్ల్యూ పిలుపు మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ లేకుండాపోయిందన్నారు. జనాభాకు అనుగుణంగా పార్లమెంట్, శాసన సభలో 50 శాతం రిజర్వేషన్ కోరితే 33 శాతం చట్టం చేశారన్నారు. దానిని కూడా అనేక ఆంక్షలు పెట్టి 2029 తర్వాత అమల్లోకి వచ్చేలా దుర్మార్గంగా ప్రవర్తించిందన్నారు. మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రోహిణీదేవి, బాలనాగమ్మ, గూడూరు సీతామహలక్ష్మి, టి.శ్రీరామమూర్తి, వై.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార : ద్వారకానగర్ మొదటి లైన్‌లో ఉన్న రవీంద్ర భారతి పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ ఎంఎస్ మణి మాట్లాడుతూ టెస్ట్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఆశీర్వదించారు. విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎన్.వెంకటేష్, ప్రిన్సిపాల్ ఒ.సాయి సౌందర్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పాండే

మహారాణిపేట : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన, శిక్షణ కార్యక్రమాలు జిల్లా పరిషత్ ఫంక్షన్ హాల్లో జరిగాయి. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్ పాండే మాట్లాడుతూ దేశం, రాష్ట్రాల్లోనూ అనేక చట్టాలు ఉన్నప్పటికీ వినియోగదారులకి ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. అందుకే కౌన్సిల్ జాతీయ స్థాయిలో వినియోగదారుల హక్కులు కాపాడుతుందన్నారు. చట్టపరంగా వారికి జరుగుతున్న అన్యా యాలు, సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ఉపాధ్యక్షుడు పీవీజీ విశ్వనాథ్, జాతీయ, రాష్ట్ర ప్రతినిధులు కేకే చాంద్ దుర్గారావు, చంద్రశేఖర్, పీఎస్ ప్రసాద్ రాజు, రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్.బి. శంకర్, జీవరత్నం, వెంకటలక్ష్మి, సాగర్, జీవన్, చంద్రమౌళి, కల్యాణ్, జుగల్, శ్రీధర్, ఇక్బాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక న్యాయం కోసమే పోటీ'

దాబాగార్డెన్స్ : ఏపీలో సామాజిక న్యాయం కోసమే సమాజ్‌వాదీ పార్టీ పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 175 స్థానాలకు తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో జగదీష్, సూరాడ ఎల్లాజీ, సీహెచ్ రాజు, మురళీమోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

సీతంపేట: ప్రపంచ గ్లకోమా అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్లకోమా వ్యాధిపై అవగాహన కోసం రామా టాకీస్ నుంచి సత్యం సెంటర్ వరకు జరిగిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా వైద్య విద్యార్థులు ఆస్పత్రి ఆవరణలో కంటి ఆకృతిని ప్రదర్శించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ టి.జ్యోతిర్మయి, వైద్యులు రమణ, ప్రేమలత, పద్మావతి, వాణిశ్రీ, సౌజన్య, శ్రీలక్ష్మి, పీఎంవోవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, సుబ్బలక్ష్మి, సుజాత, జూనియర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'అరకు పార్లమెంట్ టికెట్ కేటాయించాలి'

దాబాగార్డెన్స్ : అరకు పార్లమెంట్ టికెట్ కాంగ్రెస్ పార్టీ తనకే కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సెక్రటరీ కొరాబు ప్రీతి విజ్ఞప్తి చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏ ప్రభుత్వం వచ్చినా గిరిజనులకు న్యాయం జరగడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం నుంచి ఉన్న తనకు ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం



కాలవలపై ఆక్రమణలను పరిశీలిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్

జగదాంబ : కాలువలపై ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్, పందుపుల్లల సందు, వెలంపేట, సీహార్స్ జంక్షన్, 75 ఫీట్‌రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన కాలువలు, వీధుల్లో ఉన్న కాలువలపై ఆక్రమణలు తొలగించి కాలువలు పరిశుభ్రం చేయాలన్నారు. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త, సిల్ట్ తొలగించాలన్నారు. రోడ్లపై ఇంటి నిర్మాణ వ్యర్థాలు వేయకుండా సెక్రటరీలు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై చెత్త ఎప్పటికప్పుడు యార్డుకు తరలించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కలిసి ఆక్రమణల తొలగింపునకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పూర్ణామార్కెట్ వద్ద వ్యర్థాలు బయట పడకుండా దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ పీవీవీడి ప్రసాదరావు, ఏఎంహెచ్‌వో రాజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారి షంషుద్దీన్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ సన్నిధిలో భారీ అన్నదానం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం శివరాత్రి మారువారం సందర్భంగా భారీ అన్నదానం జరిగింది. ఈ నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సీలాపు సర్వేశ్వరరెడ్డి, ఈవో జి.వి.రమాబాయి, ట్రస్టు సభ్యులు ఎరుకుమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు పిల్లిస్వాతి, పి.లక్ష్మీనారాయణమ్మ, పిల్లి దుర్గ, పెద్దాడ రమణమ్మ, దళాయి అన్నపూర్ణ, కె.బ్రహ్మాజీ, బంటుపల్లి సూర్యనారాయణ, సరగడ నర్సింగరావు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

30 వేల మెజార్టీకి కృషి చేస్తా..



బొత్స ఝాన్సీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిచిన బొత్స ఝాన్సీకి నియోజకవర్గం నుంచి 30 వేల మెజార్టీకి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న వాసుపల్లి ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

- రేపు వార్షిక జాతర



ఎల్లమ్మ దేవాలయం

దాబాగార్డెన్స్ : భక్తుల కొంగు బంగారంగా పూజలందుకుంటున్న ఎల్లమ్మ వార్షిక జాతర శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. శనివారం తొలేళ్ల ఉత్సవం, ఆదివారం జాతర జరపనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదును పట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మ తోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆదివారం వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, దర్శనాలు, ఉదయం నుంచి మాలధారణ భక్తుల శూలాల ప్రదర్శన నిర్వహిస్తారు. సాయంత్రం అగ్నిగుండం తొక్కుతారు.

ఏడుగురు అక్కచెల్లెళ్లకు ఒకే సోదరుడు..

ఎల్లమ్మ అనకాపల్లి నూకాలమ్మ, గంగాలమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, బంగారమ్మ, పోలమ్మ అమ్మవార్లకు పోతురాజు ఒక్కరే అన్నదమ్ముడు. ఎల్లమ్మ తోటలోని అమ్మవారి దేవాలయానికి సమీపంలో పోతురాజు పుట్ట ఉంది. ఈ ఆలయానికి పోతురాజు పుట్టకు సొరంగ మార్గం ఉందని పూర్వీకులు చెబుతారు. ఈ ఎల్లమ్మ పేరునే ఆ ప్రాంతాన్ని ఎల్లమ్మతోటగా పిలుస్తున్నారు. ఆలయానికి 80 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దలు అంటారు.

ప్రత్యేక ఏర్పాట్లు..



యల్లమ్మ జాతర వార్షికోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఉచిత ప్రసాదం అందజేయనున్నాం.

– కె. పద్మావతి, ఈవో, ఎల్లమ్మ దేవాలయం

సీఏ పరీక్షలకు హాజరు కానున్న 4.36 లక్షల మంది

దాబాగార్డెన్స్ : ఈ ఏడాది మేలో నిర్వహించనున్న సీఏ పరీక్షలకు దేశవ్యాప్తంగా 4 లక్షల 36 వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ అడ్మిన్ అడ్వైజర్, సీఏ మట్టుపల్లి మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఏ ఇనిస్టిట్యూట్ 75 ఏళ్ల చరిత్రలో ఒక పూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని, ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ అనేది ఐసీఏఐకి ఒక గవర్నింగ్ బాడీ వంటి సెంట్రల్ కౌన్సిల్ అని చెప్పారు. ఇంత ఎక్కువ మంది విద్యార్థులు సీఏ పరీక్షలు రాయడం చరిత్రలో తొలిసారి అని పేర్కొన్నారు. దీనివల్ల దేశ వ్యాప్తంగా సీఏ కోర్స్‌కు ఎంత డిమాండ్ ఉందో తెలుస్తుందన్నారు. టెన్త్ క్లాస్ తర్వాత ఇంటర్‌లో ఎంఈసీ గ్రూప్ సీఏ చదవాలనుకునే వారికి చాలా అనువైన గ్రూప్ అని చెప్పారు.